"కాఫీకని పేరుపెట్టి పిలిచాం: కాఫీలో విషం కలిపి యిచ్చాము. దాని పేరేదో జ్ఞాపకంలేదుగాని, అదితిన్న పది నిమిషాలలో ప్రాణాలుపోతాయిట. మీకు ఇంకొక్కనిమిషం గడువుంది. ఈపాటికే మీతలలోనూ, పొట్టలోనూ మంట ఆరంభమయి వుండాలి" అని ముగించాడు శర్మ.

"ఆఁ" అని డాక్టరు లేవబోయాడు. గుండెలమీదనూ, పొట్టమీదనూ చెయ్యివేసి తడుముకోవడం ఆరంభించాడు. కొంచెంసేపటిలోనే అతని మొహం నల్లబడింది. మొహంమీద ముచ్చెమటలు పోశాయి. కుర్చీలో వుండగానే అతనితల ముందుకువంగి గుండెలమీద వ్రేళ్లాడింది.

"అయిపోయింది" అన్నాడు శర్మ.

"కేవలం భయమూలాన అంత శీఘ్రంగా నిండుప్రాణం యెగిరిపోవడం నేను యిదివరకు యెప్పుడూ చూడలేదు" అన్నాడు రావు.

మూర్తి తల వెనక్కితిప్పి "గుండెలుఆగి చనిపోయాడని పోలీసులకి కబురు పంపించు" అన్నాడు.

# కలికాలం

తెల్లవారుఝాము అయింది. కాకులు కూస్తున్నాయి. ఊరు అప్పుడప్పుడే నిద్ర మేల్కొంటున్నది.

కరణంగారి యింటిముందు మాత్రం అలికిడి కొంచెం ఎక్కువగా వున్నది. గూడుకట్టిన రెండెడ్ల బండి గుమ్మంముందు నిలచివుంది. కమతగాడు, పెట్టెలు, ఏవేవో సామాను బండీలో పెడుతున్నాడు.

కరణం అరుగుమీద కూచుని మొహం కడుక్కుంటున్నాడు.

భార్య లోపలినుంచి బైటికివచ్చి "అమ్మాయి కనపడదేమండీ!" అన్నది.

"ఎక్కడికి వెడుతుంది, చూడు, నిద్దరలేచిందో లేదో" అన్నాడు కరణం.

"గంటసేపటినుంచీ వెతుకుతున్నాను, కనపడలేదండీ. పిల్లవాడు పక్కమీదనే వున్నాడు. అమ్మాయిమాత్రం కనపడదు." అన్నది కరణం భార్య.

,,వూరికి వెడుతున్నానని చెప్పిరావడానికి ఎవరి యింటికేనా వెళ్ళిందేమో?'' అన్నాడు కరణం.

,,అబ్బే! నిన్న సాయంత్రం అందరియిళ్ళకీ వెళ్ళి చెప్పివచ్చింది. నేను నిద్దర లేచేటప్పటికే పక్కమీద లేదు. బైటికి వెళ్ళిందేమో అనుకున్నాను.. కాని ఇంతసేపా! నాకేమో అనుమానంగా వుందండీ'' అని భయంతో చెప్పింది కరణం భార్య.

"అల్లుడు ఏంచేస్తున్నాడు?'' అని కరణం అడిగాడు.

,,బావి దగ్గర స్నానం చేస్తున్నాడు. అతన్నికూడా అడిగాను. అతనికి తెలియదుట.'' అని జవాబు చెప్పింది ఆమె.

,,అయితే ఎక్కడికి వెళ్ళిందంటావు?'' అని అనుమానంతో అడిగాడు కరణం.

,,అదే నాకూ భయంగ్గా వున్నది. ప్రయాణమంటే సరదాగానే ఉంది కాని, వెళ్ళనన్నమాటే అనలేదు; కొంచెం చూడండి'' అని భార్య చెప్పింది.

కరణానికికూడా కొంచెం భయం కలిగింది. కమతగాణ్ణి వెళ్ళి నాలుగు యిళ్ళల్లోనూ కనుక్కొని రమ్మన్నాడు.

కమతగాడు వెళ్ళి కరణంగారి అమ్మాయి మీయింట్లో వుందా? అని అందర్నీ అడిగిరావడమూ, ఎక్కడా లేకపోవడముతో కరణానికి గాభరా ఎక్కువయింది.

ఈలోపల కరణంగారి అమ్మాయి ఎక్కడికో వెళ్ళిపోయిందనే పుకారు కూడా వూరంతా పాక్కిపోయింది. భళ్ళున తెల్లవారింది కూడాను!

ఎద్దులు కట్టిన బండి, గుమ్మంలో అలాగే నిలుచుండిపోయింది. ఎద్దులకు మాత్రం గంటల తరబడి అలా నిలుచుని వుండటం విసుగు పుడుతున్నది. కరణంగారి అల్లుడు భోజనంచేసి ప్రయాణానికి సిద్ధంగా కూచున్నాడు. కరణంగారి మనమడు నాలుగేళ్ళవాడు నిద్రలేచి ,,అమ్మ ఏది'' అని అడుగుతున్నాడు. వూరంతా, అందరి యిళ్ళల్లోనూ వెదికినా కరణంగారి కుమార్తె కనపడదు.

ఏమై వుంటుందంటే, ఏమై వుంటుకదని అందరూ ఆశ్చర్యపడుతున్నారు.

'నూతులు గోతులూ వెతకండర్రా' అని కరణంభార్య చెప్పినమీదట, ఊరి జనమంతా పోగై ఊళ్లోవున్న బావులూ. ఊరిబయట ఉన్న చెరువూ గాలించి వేశారు. ఎక్కడా కరణం కూతురి జాడ కనపడలేదు.

మధ్యాహ్నమైపోయింది. ఎవరికీ ఏమీ తోచడంలేదు. ఎద్దులతో సహా బండి అలాగే నిలచుని వున్నది. కరణంగారి అల్లుడు, వసారాలో మంచం మీద పడుకుని ఆలోచిస్తున్నాడు. కరణం భార్య, తల్లికోసం ఏడుస్తున్న మనమణ్ణి సముదాయించలేకా, పరామర్శకు వచ్చిన ఆడవాళ్లకు సమాధానం చెప్పలేకా సతమతమవుతున్నది. కరణంగారు బావులూ, చెరువులూ వెతికించి, యింటికి చేరాడు.

అల్లుడు వుండగా, కూతుర్నిగురించి సందేహాస్పదంగా మాట్లాడుకోవడానికి వీలులేక, భార్యాభర్తలిద్దరూ నిర్విణ్ణులై కూర్చున్నారు.

ఊరంతా పరిపరి విధాల అనుకుంటున్నారు. మునసబుగారియింట్లో పదిమందీ చేరారు.

"అప్సరసలాంటి పిల్ల, పాపం!" అని మునసబు నిట్టూర్పు విడిచాడు.

"ఎవణ్ణి తగులుకు లేచిపోయిందో!" అన్నాడు నా య్య.

"అబ్బే! ఆపిల్ల అట్లాటిదికాదు. నామటుకు నాకు తెలుసును. నూరు రూపాయల నోటు పంపిస్తే తిప్పి పంపించేసింది" అన్నాడు చాదరి.

"నీకు లొంగకపోతే అంతేనా ఏం! అత్తారిఊళ్ళో. ఏంజరిగిందో తెలుసునా. వాళ్లయింటి ప్రక్కనేవున్న మిషనుకుట్టువాడితో యిలాకా అయిందట. ఒకరోజున మొగుడు కంటబడితే చావ బాదినాడట. ఆపయిన లేచి చక్కా వచ్చింది. వచ్చింది వచ్చినట్లు మూడేళ్లు యిక్కడనే వుండిపోయిందిగదా. ఈనాడు మొగుడువచ్చి పిలుస్తేమటుకు పోబుద్ధి పుడతదంటయ్యా! ఈలోపల యీ వ్రాళ్లో ఎవర్నయినా చక్కబెట్టకుండా వుంటుందా? మునసబుకొడుకేడీ, వున్నాడా......?" అని నాగయ్య అంటూ వుండగా, "తాగుమోతు కూతలు కుయ్యబోక" అని మునసబు

కోడును గద్దించాడు. అక్కడున్న వారంతా ఘొల్లున నవ్వారు.

సరిగ్గా ఆ సమయంలోనే, కమతగాడు అక్కడికివచ్చి "కరణంగారు ఒకసారి తమర్ని పిలుచుకు రమ్మన్నారండి" అని మునసబుతో చెప్పాడు.

"వస్తున్నా" అంటూ మునసబు వెళ్లాడు.

మునసబుతో కరణం సుమారు ఒకగంటసేపు ఆలోచించాడు. మునసబు వెళ్లి చుట్టుపక్కల వూళ్లల్లో వెదకడానికి తన మనుష్యుల్ని పదిమందిని పంపించాడు.

కరణమూ, బోర్డుస్కూలు మాస్టరూ కలిసి ఆలోచించుకున్నారు. రైలు స్టేషను ఆవూరికి ఆరుమైళ్ల దూరంలో వున్నది. ఇద్దరూ కలిసి అక్కడికి ప్రయాణమై వెళ్లారు. అల్లుడిదారిన అల్లుడు వెళ్లిపోయాడు.

రైలుస్టేషనులో బుకింగ్ క్లర్కును, బోర్డుస్కూలు మాస్టరు అడిగి తెలుసుకున్నదానినిబట్టి, తెల్లవారుఝామున చీరాలకు టిక్కెట్టుకొని ఒక చక్కని అమ్మాయినీ, ఒక కూలివాడూ వెళ్లారని తేలింది. కూలివాడు ఎవరా అని కరణమూ, మాస్టరూ యిద్దరూ చాలాసేపు ఆలోచించుకున్నారు. తన ఎద్దుల సావడి బాగుచేసే మాదిగ వెంకాయ ప్రొద్దుటినుంచీ తనకు కనపడలేదన్న సంగతి కరణానికి అప్పుడు జ్ఞాపకం వచ్చింది.

"వాళ్ల చుట్టాలు చీరాలలో వున్నారని నాకు జ్ఞాపకం, పోదాం పద" అని మాస్టరును వెంటబెట్టుకొని కరణం చీరాలకు టిక్కెట్టు తీసుకొని సాయంత్రం బండిలో చీరాలకు వెళ్లారు. చీరాల స్టేషనునుంచి బండి కట్టించుకొని, పేరాల మాదిగపల్లెకు వెళ్లి విచారించగా, వెంకాయ ఒక చక్కని పడుచును వెంటబెట్టుకొని ప్రొద్దున్న అక్కడికి వచ్చినట్లూ మధ్యాహ్నం బండిలో బయలుదేరి ఒంగోలుకు పోయినట్లూ బయట పడింది. కరణమూ, మాస్టరూ తెల్లవారుఝామున మెయిలులో బయలుదేరి ఒంగోలుకు వెళ్లారు. అక్కడ మాదిగపల్లెలో విచారించగా, వెంకాయ ఒక చక్కని పడుచుతో సాయంత్రం అక్కడికి వచ్చినట్టూ, ప్రొద్దుగూకగానే బండికట్టుకొని మార్టూరు వెళ్లినట్టూ తెలిసింది. కరణమూ మాస్టరూకలసి గుర్రబ్బండి

కట్టించుకొని మార్టూరు వెళ్లారు.

వీరు మార్టూరు చేరేటప్పటికి ఉదయం పదిగంటలయింది. సరాసరి మాదిగగూడెం దగ్గరకు వెళ్లారు. రెండు ఇళ్లుదాటి మూడోయింటి దగ్గరకు వస్తూరుగదా-గుడిసెముందు జుట్టు ఆరబోసుకుంటూ నీడలో కూచుని, గుడిసె లోపల కూచున్న వెంకాయతో కబుర్లుచెపుతున్న కరణంకూతురు-కరణం నిలువునా స్తంభించిపోయినాడు. కూతురుకోసం వెతికేతొందరలో, తన కూతురు తనకు ఏస్థితిలో కనపడుతుందో అతడు ఆలోచించుకోలేదు. తండ్రినీ, మాస్టరునూ చూసి ఆమె నిశ్చేష్టురాలయింది. వీరిని చూసీచూడ్డం తోనే, ఒక్కదుముకున గుడిసెలోనుంచి బయటకువచ్చి, కనపడకుండా పారిపోయాడు వెంకాయ. "ఇవతలకి లేచిరా అమ్మాయ్" అని మాస్టరు కేకవేశాడు. ఆమె మాట్లాడకుండా లేచి వచ్చింది.

ముగ్గురూకలసి బండికట్టించుకొని సరాసరి ఒంగోలుకు వెళ్లారు. అక్కడ సత్రంలో దిగారు. మాస్టరు ఊళ్లోకివెళ్లి కొత్తబట్టలు కొనుక్కొని వచ్చాడు. స్నానాలుచేసి కొత్తబట్టలు కట్టుకొని అందరూ భోజనాలు చేశారు.

రాత్రి మెయిలులో ఎక్కి ముగ్గురూ సరాసరి ఏలూరు వెళ్లి కరణంగారి బంధువుల యింట్లో దిగారు.

అమ్మాయి ఏలూరులో తమ బంధువుల యింట్లో వుందనీ, తీసుకొని వస్తున్నామనీ కరణం తన యింటికే ఒక టెలిగ్రాం కొట్టాడు. మరునాడు బయలుదేరి ముగ్గురూ తమవూరికి వెళ్లారు.

భర్త ఆమెను యిదివరకు ఎప్పుడో కొట్టాడనీ, అంచేత ఆమె భయపడి ఏలూరు పారిపోయిందనీ, కరణమూ, మాస్టరూ వూళ్లో అందరికీ చెప్పారు.

వారంరోజులు అయినతరువాత కరణం వెళ్లి అల్లుణ్ణి పిలుచుకువచ్చి పదిరోజులు తన యింట్లో వుంచుకొని, సత్యనారాయణ వ్రతంచేసి వూళ్లో అందరినీ భోజనాలకిపిలచి- ఆ మరునాడు కూతుర్నీ అల్లుణ్ణీ సాగనంపాడు.

నెలరోజులు గడిచిపోయాయి. మధ్యాహ్నంపూట కరణం లెక్కలు

వ్రాసుకుంటూ వుండగా, కూతురుగారి ఊరునుంచి మనిషివచ్చి, ఆమె కిరసనాయిలు వొంటిమీద పోసుకొని, అంటించుకుని కాలిపోయిందని చెప్పాడు.

కరణము, గోడుగోడున ఏడుస్తూవున్న భార్యను వెంటబెట్టుకొని దగ్ధమైపోయిన కూతుర్ని ఆఖరిసారి చూడడానికి వెళ్లాడు.

# ప్రేమ

అర్ధరాత్రి సరిగ్గా పన్నెండు గంటలవేళ. వీధి తలుపు చప్పుడయింది.

ఇంట్లోవున్నవారు ఒక్కొక్కరే „ఎవరువారూ?” అని కేకవేశారు. ఆ ప్రశ్నకు సమాధానం రాలేదు. తలుపు చప్పుడుమాత్రం అవుతూనేవున్నది. లేచి వెళ్లి తలుపు తియ్యడానికి ఎవరికి వారికే బద్ధకంగావుంది. ఎవరూ లేవలేదు. చప్పుడు—మెల్లగా—అవుతునే వున్నది.

„ఎవరంటే మాట్లాడరేమిటమ్మా? అమ్మాయీ కనకం, వెళ్లి తలుపు తియ్యి, మీ బాబాయి అయివుంటాడు. ఆయనకు యిదే దురలవాటు ఎన్ని పిలిచినా పలకడు.” అని వసారాలో మూలగా పడుకున్న ముసలమ్మ సణిగింది.

„వస్తున్నా వుండండి, ఎవరో” అని కనకం—కళ్లు నులుముకుంటూ నడవ గదిలోనుంచి వసారాలోకి వస్తూ అంది. ఆజవాబుతో తలుపు చప్పుడు ఆగింది.

అగ్గిపెట్టెకోసం, రాత్రి యెప్పుడో ఆర్పి, ఎక్కడో పెట్టిన లాంతరుకోసం వెతుక్కొని, లాంతరు వెలిగించుకొని, కనకం తలుపు తియ్యడానికి వచ్చేటప్పటికి, అర్ధరాత్రివేళ నిద్రాభంగం పొందిన ఆ యింటిలోని ఇద్దరు ముగ్గురికి మళ్ళీ నిద్ర గాఢంగా పట్టింది.

పాపం! ఆ వచ్చినవారెవరికో తలుపుతీసే అవస్థ కనకానికిమాత్రం